ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

దోమ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడుగోనిపల్లిలో శనివారం జరుగుతున్న ఇళ్ల సర్వేను ఎంపీడీవో మహేశ్‌బాబు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఇంటిని సర్వేచేసి ఆన్‌లైన్‌లో పొందుపర్చి ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. రానున్న వర్షాకాలం ప్రారంభం నాటికి ప్రతీ గ్రామ పంచాయతీలో 40వేల మొక్కలను నాటేందుకు పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు.

నేడు తాండూరులో ముత్యాల ముగ్గుల పోటీలు

పాతకుంట పార్కు ప్రాంగణంలో ఏర్పాట్లు



తాండూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని పురస్కరించుకుని యేటా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సహకారంతో 5వ తేదీ(ఆదివారం) తాండూరు పట్టణం ఆదర్శ నగర్ పార్కు (పాత కుంట)లో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే మహిళలు, యువతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఆసక్తి కలిగిన మహిళలు, యువతులు 9985411091, 9100491109 నంబర్లకు ఫోన్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోవాలి. మహిళలు, యువతులు నేరుగా ముగ్గుల పోటీ జరిగే కేంద్రానికి వచ్చి సైతం తమ వివరాలు నమోదు చేసుకుని పోటీల్లో పాల్గొనవచ్చు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రథమ బహుమతి కింద రూ.6 వేలు, ద్వితీయ బహుమతి రూ.4 వేలు, తృతీయ బహుమతి కింద రూ. 3 వేల నగదు బహుమతులు అందజేస్తారు. అలాగే మరో ముగ్గురికి ప్రోత్సాహక బహుమతులతో పాటు, ముగ్గుల పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ కన్సోలేషన్ బహుమతిని అందించనున్నారు. ఈ పోటీలకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సతీమణి అరుణమనోహర్‌రెడ్డి (బీఎంఆర్ ఫౌండేషన్) స్పానర్స్‌గా నిలిచారు. కాగా, పోటీలు నిర్వహించే ఆదర్శ నగర్ (పాత కుంట) పార్కు మైదానంలో ఏర్పాట్లను శనివారం తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, డైరెక్టర్ విజయ భాస్కర్ రెడ్డి, కౌన్సిలర్ సోమ శేఖర్, పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటయ్య ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేశారు.

సప్తవర్ణాల హరివిల్లు

సందడిగా ముత్యాల ముగ్గుల పోటీలు

పుడమిపై సప్తవర్ణాల రంగవల్లులు అలరించాయి. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్ట్‌నర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్) సహకారంతో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు ఇలపై హరివిల్లును తలపించాయి. మేడ్చల్ జిల్లా శామీర్‌పేట నల్సార్ రోడ్డు, బస్టాప్ వెనుక తెలంగాణ క్రీడా ప్రాంగణం(మినీ స్టేడియం)లో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన లభించింది. ఈ పోటీలకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 70 మంది మహిళలు, విద్యార్థినులు హాజరై ఉత్సాహంగా ముగ్గులు వేశారు.



క్రీడా ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న మహిళలు





మూడో బహుమతి గెలుపొందిన ముగ్గు

మాధవి

- ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలకు అనూహ్య స్పందన
- మహిళలతో సందడిగా తెలంగాణ క్రీడా ప్రాంగణం
- ఆకట్టుకున్న రంగురంగుల రంగవల్లులు
- పోటీల్లో పాల్గొన్న 70 మంది మహిళలు
- హాజరైన శామీర్‌పేట, ఎంసీపల్లి తహసీల్దార్లు

మేడ్చల్ నెట్‌వర్క్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ముత్యాల ముగ్గుల పోటీల్లో సంక్రాంతి నేపథ్యంతో పాటు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా వేసిన ముగ్గులు ఆహుతులను ఆకట్టుకున్నాయి. పలువురు మహిళలు తమ చిన్ననాటి జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకోవడంతో వారి కళ్లు చెమర్చాయి. నాటి తీపిగుర్తులను గుర్తు చేసిన ఆంధ్రజ్యోతికి మహిళల నుంచి కృతజ్ఞతల వెల్లువ లభించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా శామీర్‌పేట, మూడుచింతలపల్లి మండలాల తహసీల్దార్లు యాదగిరిరెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, మూడుచింతలపల్లి మాజీ సర్పంచ్ జాం రవి,

మిగతా 8వ పేజీలో...

సంతోషంగా ఉంది

ఏబీఎస్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన ఈ ముగ్గుల పోటీల్లో పాల్గొని విజేతగా నిలవడం సంతోషంగా ఉంది. ప్రతీ సంవత్సరం సంక్రాంతి పండుగకు మహిళలను ప్రోత్సహించడానికి ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం. మహిళలంతా ఒక చోట చేరి ముగ్గులు వేయడం సందడిగా అనిపించింది.

-లావణ్య, ప్రథమ బహుమతి విజేత



లావణ్యకు మొదటి బహుమతిని అందజేస్తున్న అతిథులు



లావణ్య



మొదటి బహుమతి గెలుపొందిన ముగ్గు



ప్రత్యూష



రెండో బహుమతి గెలుపొందిన ముగ్గు

జిల్లాలో 7,045 మంది అంధులు

మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమ జిల్లా అధికారి కృష్ణవేణి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణవేణి

వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 7,045 మంది అంధులు ఉన్నారని జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు. శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ ఆదర్శప్రాయుడని అతను ఎన్నో రకాల బాధలు అనుభవించి అంధుల కోసం ప్రత్యేకమైన ఆరు చుక్కల లిపిని కనుక్కొని వారు కూడా సమాజంలో అందరిలాగా చదువుకునే అవకాశం కల్పించినట్లు తెలిపారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ డీపీఎం రామ్మూర్తి మాట్లాడుతూ లూయిస్ బ్రెయిలీ అంధులను తన లిపి ద్వారా గొప్ప స్థానాల్లో నిలబెట్టారని అలాగే ప్రతి సంవత్సరం అతను చేసిన పనుల ద్వారా ప్రపంచం మొత్తం అతని జయంతి వేడుకలు జరపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మర్పల్లి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రవీణ, పరిగి ఆఫీసర్ మెహర్ ఉన్నిసా, వికారాబాద్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేశ్వరమ్మ, ప్రాజెక్ట్ ఆఫీసర్ కాంతారావు, ఫీల్డ్ రెస్పాన్స్ ఆఫీసర్ వెంకటేశ్, సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

పెరిగిన చలి తీవ్రత

రంగారెడ్డి అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో చలి గజగజ వణికిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే దిగువకు పడిపోయాయి. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో అత్యల్పంగా 6.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది వికారాబాద్ జిల్లా మొమిన్‌పేటలో 7.8 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ పరిధిలోని మౌలాలిలో 9.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. పెరిగిన చలి తీవ్రత వల్ల చలి మంటలు కాచుకుంటున్నారు. వేకువజామునే పొలాలకు వెళ్లే రైతులు సూర్యుడు ఉదయించి ఎండ వచ్చాకే వెళ్తున్నారు. చలి తీవ్రత కారణంగా వృద్ధులు, చిన్నారులు జాగ్రత్తగా ఉండేలా చూసుకోవాలని వైద్యులు చెబుతున్నారు.

కేంద్రం నుంచి రాష్ట్రానికి అధిక నిధులు



మాట్లాడుతున్న ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డి

ధారూరు, జనవరి4(ఆంధ్రజ్యోతి): కేంద్రం నుంచి తెలంగాణకు అధిక నిధులు మంజూరవుతున్నాయని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామంలో శనివారం బీఎస్ఎన్ఎల్ 4జీ సెల్ టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంటలకు మద్దతు ధర కోసం కేంద్రం రూ.22 వేల కోట్లు ఇచ్చిందని చెప్పారు. పదేండ్లలో దేశం ఐదింతల అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అతి తక్కువ నిధులు కేటాయిస్తుండటంతో పాఠశాల విద్యలో వెనుకబడిందని ఆరోపించారు. తాండూరు-పరిగి-రాస్నం, నాగారం నుంచి రాజాపూర్ గ్రామాల బీటీ రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. నాగారంలో పెట్రోల్ పంపు ఏర్పాటు, కోట్‌పల్లి ప్రాజెక్టును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ రాష్ట్ర ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, నాయకులు బీజేపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్లనందు, హన్మంత్ రెడ్డి, రమేశ్, పాండుగౌడ్, వివేకానంద రెడ్డి, రాజునాయక్ పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం



షాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాగృతి షాద్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ ఎండీ ముస్తఫా షాబాద్ మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో శనివారం అయ్యప్ప స్వాములకు భిక్ష ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ.. మతసామరస్యానికి ప్రతీకగా కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు రవీందర్‌గౌడ్, బాల్‌రాజ్, జడల రాజేందర్‌గౌడ్, మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

రాజకీయాలతో సంబంధం లేకుండా పని చేయాలి



ఆలయ కమిటీ చైర్మన్‌గా నియామకపత్రం అందుకుంటున్న అల్లె కుమార్

మహేశ్వరం, జనవరి 4(ఆంధ్రజ్యోతి): రాజకీయాలతో సంబంధం లేకుండా మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్యే, కంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యారు. చైర్మన్‌గా అల్లె కుమార్, కమిటీ డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితా రెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, జంగారెడ్డి, రఘుమారెడ్డి, అంద్యానాయక్, కాకి ఈశ్వర్, ఆలయ ఈవో మురళీకృష్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీ పరీక్షకు ఎంపిక



బహుమతి అందుకుంటున్న కంకల్ విద్యార్థి ప్రకాష్

పూడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కంకల్‌కు చెందిన విద్యార్థి రాష్ట్ర స్థాయి పోటీ పరీక్షకు ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర ఫోరం సూచనల మేరకు జిల్లా, మండల స్థాయిలో ప్రతిభ పరీక్షను నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన విద్యార్థులకు శనివారం జిల్లా స్థాయి పరీక్ష నిర్వహించారు. ఇందులో మండల పరిధిలోని కంకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి ప్రకాష్ ప్రతిభ కనబరిచాడు. రాష్ట్రస్థాయి పోటీ పరీక్షకు ఎంపికైన విద్యార్థి గైడ్ టీచర్ చంద్రమోహన్‌తో కలిసి బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా విద్యార్థి ప్రకాష్, గైడ్ టీచర్ చంద్రమోహన్‌ను ప్రధానోపాధ్యాయురాలు పుష్ప, ఉపాధ్యాయులు, పాఠశాల కమిటీ చైర్మన్ సోని అభినందించారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఆర్డీవో చంద్రకళ, తహసీల్దార్

శంకర్‌పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. శంకర్‌పల్లిలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని శనివారం రాత్రి తహసీల్దార్ సురేందర్‌తో కలిసి తనిఖీ చేశారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకొని, వారితో కలిసి భోజనం చేశారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. దోమల నివారణకు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి మందు స్ప్రే చేయించాలని డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని ఆదేశించారు. దాతల సహకారంతో విద్యార్థులకు సహాయసహకారాలు అందించాలని, విద్యార్థులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని, నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ పాండును ఆదేశించారు. పట్టణంలోని సింగాపురానికి చెందిన డాక్యుమెంట్ రైటర్ చెన్నారెడ్డి విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయగా ఆమె వాటిని విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాములు, బాల్‌రాజ్, వీఆర్ఏ రాజశేఖర్ ఉన్నారు.

చదువు రావడం లేదని విద్యార్థిని ఆత్మహత్య

మూడుచింతలపల్లి, జనవరి 4(ఆంధ్రజ్యోతి): 'ఏంటిరా బాబు నా జీవితం.. పిచ్చి లేస్తుంది, ఏమీ రావు, ఎప్పుడూ తినడం, పడుకోవడం.. ఏంటి నా లైఫ్.. అస్సలు నాకు నిజంగానే ఏమీ రావా, ఏంటి అసలు నా లైఫ్ మొత్తం ఇలానే ఉంటుందా? నాకు అంటూ ఎవరూ లేరా.. నా జీవితం.. చచ్చిపోవాలనిపిస్తుంది..' అని సూసైడ్ నోట్ రాసి ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన జీనోమ్‌వ్యాలీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లిలోని ఉమాశంకర్ రైస్‌మిల్‌లో పని చేస్తున్న నాగవెంకటరమణ, లక్ష్మీ దంపతుల కూతురు (16)స్థానిక విజేత టెక్నో పాఠశాలలో పదో తరగతి చదువుతుంది. ఎంత చదివినా గుర్తు ఉండటం లేదని, చదువు రాదని జీవితంపై విరక్తి చెందింది. శుక్రవారం నోట్ బుక్‌లో సూసైడ్‌నోట్ రాసి ఇంట్లోని బాత్‌రూంలో చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం తల్లి బాత్‌రూమ్‌కు వెళ్లగా కూతురు ఉరివేసుకొని వేలాడుతుండడాన్ని చూసి విస్మయానికి లోనైంది. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు, పోలీసులకు తెలిపింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం

కడ్తాల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ రాజీలేని పోరాటం చేస్తుందని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కందాడి శ్రీరామ్ అన్నారు. కడ్తాల్‌లో శనివారం ఏబీవీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అఖిల భారత విద్యార్థి పరిషత్ కడ్తాల నగర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా నేనావత్ పవన్, ఉపాధ్యక్షుడిగా ఉమేశ్, సంయుక్త కార్యదర్శిగా శ్రీకాంత్, స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ కన్వీనర్‌గా అఖిల్, క్రీడా కన్వీనర్‌గా గణేశ్, విద్యార్థి సేవ కన్వీనర్‌గా దశరథం, కార్యవర్గ సభ్యులుగా నరేందర్, సందీప్, పవన్, దిలీప్ ఎన్నికయ్యారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్యామ శ్రీకాంత్ ఉన్నారు.



ఆధార్ కార్డు తరహాలో గుర్తింపు కార్డు

- ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు వివరాలు నిక్షిప్తం
- వన్ నేషన్ - వన్ ఐడీ పేరుతో కార్డు జారీ
- తల్లిదండ్రుల అంగీకరంతో ప్రక్రియకు శ్రీకారం
- చేవెళ్ల డివిజన్‌లో మొదలైన నమోదు కార్యక్రమం

విద్యార్థుల భవిష్యత్తుకు అపార్

చేవెళ్ల, జనవరి 4(ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానంలో భాగంగా దేశంలో ప్రతీ విద్యార్థి విద్యార్హతల వివరాలు ఒకే కార్డులో నిక్షిప్తం చేయాలన్న ఉద్దేశంతో కేంద్రం ఆటోమేటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (ఏపీఏఏఆర్ లేదా అపార్) ఐడీ కార్డులు రూపొందిస్తుంది. దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు పర్మనెంట్ నంబర్‌తో కూడిన గుర్తింపు కార్డు ఇస్తారు. ఆధార్ తరహాలో వన్ నేషన్-వన్ ఐడీ పేరుతో 11 అంకెలతో అపార్ కార్డును అందుబాటులోకి తీసుకొచ్చింది. కార్డు జారీకి రాష్ట్ర, కేంద్ర విద్యాశాఖలకు ఆదేశాలు వచ్చాయి. విద్యార్థి తల్లిదండ్రులు అపార్ ఐడీ నంబర్ కోసం దరఖాస్తు చేసుకుంటే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అపార్ నమోదు ప్రక్రియను మొదలు పెడతారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల అవగాహనతోనే సాధ్యమవుతుందని అధికారులు ఇప్పటికే ఉపాధ్యాయులకు, విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

శాశ్వత గుర్తింపు సంఖ్య

అపార్‌తో ప్రతి విద్యార్థికీ శాశ్వతంగా ప్రత్యేక గుర్తింపు కార్డు సంఖ్య ఇవ్వనుంది. జిల్లా విద్యాశాఖను ఒక యూనిట్‌గా తీసుకొని ప్రతి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. దీంతో ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ సులభతరం కానుంది. రివార్డులు, డిగ్రీలు, స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్యకు అవార్డులు, ప్రాజెక్టులు, ఇంటర్వ్యూలు, ఇతర పూర్తి అకాడమిక్ డాటాను డిజిటలైజేషన్ చేయనున్నారు. అపార్‌కార్డు ద్వారా విద్యార్థుల ప్రతిభానైపుణ్యాలు ఏమిటన్న విషయాలు సులువుగా తెలుసుకునే వీలుంటుంది. ఉద్యోగ దరఖాస్తుల్లో ఈ కార్డు ప్రామాణికం కానుంది. ఈ వివరాలు కేంద్రం తప్ప ఇతరులు తెలుసుకోలేరు. ప్రీప్రైమరీ నుంచి ఉన్నత విద్య చదివే ప్రతి విద్యార్థికీ పాఠశాల, కళాశాలలు ఈ కార్డులు జారీ చేస్తాయి. వివిధ కారణాలతో తల్లిదండ్రులు బదిలీ అయినప్పుడు విద్యార్థులు ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలో చేరినా పర్మినెంట్ నంబర్ మారదు. విద్యార్థుల సంఖ్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకం పకడ్బందీగా అమలయ్యేందుకు ఈ కార్డు ఉపయోగపడనుంది.

ఎదురవుతున్న సమస్యలివి..

- అపార్ నమోదు విషయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఆసక్తి చూపించడం లేదు.
- విద్యార్థుల ఆధార్ కార్డుల్లో తప్పులుంటున్నాయి. పుట్టిన తేదీ, ఇంటిపేరు, పేరు, చిరునామాల్లో అనేక అక్షరదోషాలు ఉంటున్నాయి. వీటిని సరిచేసుకొని వచ్చే సరికి వారం లేదా 10 రోజులు సమయం పడుతోంది.
- కొందరు విద్యార్థుల వివరాలు స్కూల్ రిజిస్టర్‌లో, విద్యా శాఖ వద్ద తప్పుగా ఉన్నాయి. వీటిని ముందు ఎడిట్ చేయాల్సి ఉంటుంది. ప్రతీ మండలంలో దొర్లిన తప్పులను ఎంఐఎస్ కోఆర్డినేటర్ సాయంతో ఎడిట్ చేస్తున్నారు.
- అపార్ కార్డు వివరాల నమోదుకు తల్లిదండ్రుల అమోదం తప్పనిసరి. కానీ, చాలా మంది తల్లిదండ్రులకు విద్యార్థులకు సమాచార, సమన్వయంతో ఈ కాన్సెంట్ లెటర్లు ఇవ్వడంలో జాప్యం జరుగుతోంది.

పాఠశాలల్లో ఏర్పాట్లు పూర్తి

ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అపార్ వివరాలు ఆన్‌లైన్ చేయసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. వాటిని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు యూడైస్‌లో పొందుపరుస్తారు. లాగిన్ అయ్యాక స్కూల్ రిజిస్టర్‌లో ఉన్న వివరాలను, పిల్లలు తీసుకువచ్చిన ఆధార్ కార్డు వివరాలను పోల్చి చూస్తారు. సరిపోతే నమోదు చేస్తారు. తేడాలుంటే, ఆధార్‌లో లేకపోతే స్కూల్ రిజిస్టర్‌లో మార్పులు చేస్తారు.



ప్రభుత్వం పాఠశాలలకు జారీ చేసిన పత్రం

చేవెళ్ల డివిజన్‌లో పాఠశాలలు ఇలా..

చేవెళ్ల మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కలిపి 90 ఉన్నాయి. మొత్తం 10 వేల మంది విద్యార్థులు ఉన్నారు. షాబాద్ మండలంలో 66 ఉన్నాయి. ఇందులో 14500 వేల మంది విద్యార్థులు ఉన్నారు. శంకర్‌పల్లి మండలంలో 66 పాఠశాలలకు గాను 18,010 మంది విద్యార్థులున్నారు. మొయినాబాద్ మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 91 ఉన్నాయి. 15,000 మంది విద్యార్థులున్నారు.

విద్యార్థి పూర్తి సమాచారం ఉంటుంది



ప్రతి విద్యార్థికి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకునేందుకు ఆధార్ కార్డు తరహాలో అపార్ కార్డును కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తల్లిదండ్రులు అంగీకరం తెలుపుతూ దరఖాస్తు పంపిస్తున్నాం. అపార్ లేదా పెన్ కార్డుతో పాఠశాల యాజమాన్యాలు ఆన్‌లైన్‌లో యూడైస్‌లో విద్యార్థుల వివరాలను నమోదు చేసే క్రమంలో ఆటోమోటిక్ పెన్ జనరేట్ అవుతుంది. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థులకు టీసీ ఇచ్చే క్రమంలో టీసీపై నంబర్ తప్పనిసరిగా రాయాలి. దీంతో విద్యార్థి పూర్తి సమాచారం తెలుస్తుంది. ఇప్పటికే అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ప్రక్రియ మొదలైంది.

- పురందాస్, ఎంఈవో, చేవెళ్ల



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

'సాధన' ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలి

వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలో మహిళా మృతికి కారణమైన సాధన మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు మహేందర్, మల్లేశ్ పేర్కొన్నారు. శనివారం జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో మహిళ మృతి చెందిన ఘటనపై సమగ్రమైన విచారణ జరిపి ఆస్పత్రి యాజమాన్యం, వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రాములు, నాయకులు నర్సింహులు, వెంకటయ్య, పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలనాటికి కమిటీల ఏర్పాటు

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కిచ్చన్న, భాస్కర్‌రెడ్డి

మహేశ్వరం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నాటికి గ్రామ స్థాయి నుంచి పార్టీకి సంబంధించి అన్ని కమిటీలను ఎన్నుకుంటామని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ మహేశ్వరం ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డితో కలిసి మహేశ్‌కుమార్ గౌడ్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతం, కమిటీల నియామకం, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారన్నారు. పార్టీ ఎదుగుదలకు కష్టపడ్డ ప్రతీ కార్యకర్తకూ అండగా ఉంటామన్నారు.

సంక్రాంతిలోపు రైతు భరోసా

- సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు పెట్టుబడి సాయం
- శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్



క్యాంపు కార్యాలయం వద్ద కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగలోపు రైతులకు రైతు భరోసా డబ్బులు ప్రభుత్వం అందిస్తుందని, సాగులో ఉన్న ప్రతీ ఎకరాకు పెట్టుబడి సాయం అందుతుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించి అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ఆవరణలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉపాధి హామీ కార్డు ఉన్న లబ్ధిదారులకు రూ. 12 వేల ఆర్థిక సహాయాన్ని అందజేస్తామన్నారు. మార్కెట్ కమిటీ భవన ఆవరణలో రూ.70 లక్షలతో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. వికారాబాద్ నియోజకవర్గానికి మొదటి విడతలో 12 వేల ఇళ్ల మంజూరయ్యాయన్నారు. స్థలం లేని వారికి స్థలం ఇచ్చి ఇల్లు కట్టిస్తామన్నారు. ముందుగా పూజా కార్యక్రమం నిర్వహించి అంబేద్కర్, తెలంగాణ తల్లి చిత్రపటాలకు స్పీకర్ పూలమాలలు వేశారు. స్పీకర్‌కు మార్కెట్ కమిటీ సిబ్బంది సభాపతికి నాగలిని బహూకరించారు. జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి, ఆర్డీవో వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి ఎండి రియాజ్, కార్యదర్శి ఎండీ ఫసియొద్దీన్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, మునిసిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, ఫ్లోర్ లీడర్ సుధాకర్ రెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ సత్యనారాయణ, మహిపాల్ రెడ్డి, రత్నారెడ్డి పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించాలి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం సర్వశిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్ అన్నారు. వికారాబాద్‌లో ధర్నాలో భాగంగా ర్యాలీగా వెళ్తున్న సమయంలో క్యాంపు కార్యాలయానికి వెళ్తున్న స్పీకర్ వారిని చూసి కారు ఆపారు. అదే సమయంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున కారుకు అడ్డుగా వచ్చి మీద పడడంతో పోలీసులు వారిని అదుపు చేసేందుకు పక్కకు తోయడంతో అక్కడ గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో స్పీకర్ పక్కనే ఉన్న క్యాంపు కార్యాలయానికి కొందరూ రావాలని చెప్పి వెళ్లిపోయారు. తర్వాత పోలీసులకు, ఉద్యోగుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పలువురు ఉద్యోగులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్పీకర్‌ను కలిసి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని, చిన్న పిల్లలతో రోడ్లపై కూర్చొని ధర్నా చేస్తున్న పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్పీకర్ మీ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ఎవరూ ఆందోళన చెందవద్దని కోరారు. ప్రభుత్వం సరైన న్యాయం చేస్తుందని హామీ ఇచ్చారు.

ప్రతీ కూలీకి రూ.12 వేలు

మర్పల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ లోపు ప్రతీ కూలీ బ్యాంకు ఖాతాలో రూ.12 వేలు జమ చేస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో రూ.45 లక్షలతో అండర్ డ్రైనేజీ, రూ.20 లక్షలతో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్వరలోనే రైతు భరోసా, గృహలక్ష్మీ పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు మర్పల్లి మండలంలో రూ.104 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ టు అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జిల్లా నాయకులు రాములు యాదవ్, రామేశ్వర్, ఉప్పరి నాగేశ్, కలీమోద్దీన్, శంకరయ్యగౌడ్, నర్సిములు, పార్టీ మండల అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పార్టీలు వేరైనా కలిసి పనిచేస్తా..

తాండూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ఇప్పటివరకు కేంద్రం రూ.12 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు కేటాయించిందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సమర్థుడినే బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకుంటామని తెలిపారు. శనివారం తాండూరు పట్టణంలోని సాయిపూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ పార్టీలు వేరైనా కలిసి పని చేస్తానని తెలిపారు. తాండూరులో 40 ఏళ్ల పార్టీకి సేవలందించిన మున్సిపల్ మాజీ చైర్మన్ స్వర్గీయ నాగారం నర్సింహులు సేవలను గుర్తించి ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఎంపీ నిధులు రూ.5 కోట్లే ఉన్నందున ఒక్కో నియోజకవర్గానికి రూ.71 లక్షలు మాత్రమే కేటాయిస్తున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చేవెళ్లలో 50 శాతం గ్రామ పంచాయతీలను గెలుచుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనవెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రమేశ్‌కుమార్, మహిళా మోర్చా రాష్ట్ర నాయకురాలు శ్రీలత, కౌన్సిలర్ లావణ్య, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, బీఎస్ఎన్ఎల్ కమిటీ సభ్యుడు గాజుల శాంత్‌కుమార్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో బోర్డులు ఏర్పాటు

శంషాబాద్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): కొత్వాల్‌గూడ గ్రామంలోని 52 ఎకరాలు ప్రభుత్వానికి చెందినదని తహసీల్దార్ రవీందర్‌దత్ తెలిపారు. శనివారం సిబ్బందితో బోర్డులు ఏర్పాటు చేయించారు. అనంతరం మాట్లాడుతూ దాదాపు రూ.250 కోట్ల విలువచేసే భూములను కాపాడటానికి న్యాయస్థానంలో రెవెన్యూ సిబ్బంది పోరాటం చేశారని, ఈ భూముల్లో ప్రస్తుతం కొన్ని నిర్మాణాలతో పాటు ఓ కన్వెన్షన్‌ను గుర్తించామన్నారు. త్వరలోనే అధికారుల ఆదేశాలతో నిర్మాణాలను తొలిగిస్తామన్నారు. ఆ భూములను ప్రజల అవసరాల నిమిత్తం వినియోగిస్తామని తెలిపారు. ఈ భూముల విషయంలో కోర్టు ఆదేశాలతో తమ సిబ్బందితో బోర్డులు ఏర్పాటు చేశామని వివరించారు.

రూ.26 కోట్లతో పరిగి ఆస్పత్రి విస్తరణ

- 30 నుంచి 100 బెడ్లకు పెంపు
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



పరిగి ఆస్పత్రిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పరిగి ప్రభుత్వాస్పత్రిని రూ.26 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. శనివారం పరిగి ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి పాతభవనాలను కూల్చివేసి వాటి స్థానంలో కొత్త భవన నిర్మాణాలను ప్రారంభించాలని డీఈ లక్ష్మీనారాయణకు సూచించారు. ప్రజలందరికీ మెరుగైన ఉచిత వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అత్యాధునిక సాంకేతికతతో భవన నిర్మాణం, అన్ని రకాల చికిత్సకు అవసరపడే పరికరాలు, ఫర్నిచర్ సమకూరుస్తామని చెప్పారు. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. అత్యవసర సేవలు అందేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. జాతీయ రహదారి ఉండడం వల్ల ఇక్కడ ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రతి చిన్నదానికీ నగరానికి రెఫర్ చేయకుండా అన్ని వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పరిగి వయా నస్కల్, వికారాబాద్, పరిగి-షాద్‌నగర్, గడిసింగాపూర్ - రంగారెడ్డిపల్లి వరకు రోడ్ల విస్తరణకు రూ.340 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. సమావేశంలో డీసీహెచ్ఎం ప్రదీప్‌కుమార్, పరిగి సూపరింటెండెంట్ రాజశేఖర్, అనస్తీషియా వైద్యుడు వెంకటరత్నం, ఏఎంసీ చైర్మన్ పరశురామ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణప్రసాద్, ప్రధానకార్యదర్శి హన్మంత్ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, దోమ పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, డీసీసీ కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

బ్యాంక్ ఏర్పాటు చేయాలని ఎంపీకి వినతి



ఎంపీ మల్లు రవికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

తలకొండపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లి గ్రామంలో జాతీయ బ్యాంక్‌ను ఏర్పాటు చేయించాలని గ్రామ నాయకులు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని కోరారు. శనివారం ఈ మేరకు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. బ్యాంక్ ఏర్పాటుతో సమీప పది గ్రామాలు, తండాల ప్రజలకు సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. బ్యాంక్ ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడుతానని మల్లు రవి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. నాయకులు ప్రశాంత్‌రెడ్డి, రేణురెడ్డి, శివకుమార్‌గౌడ్, కిషన్, మధుసూదన్‌రెడ్డి, సురేశ్, మహేశ్ ఉన్నారు.

పోలీసుల తీరు అమానుషం

వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా మహిళా ఉద్యోగుల పట్ల పోలీసుల తీరు అమానుషమని సమగ్రశిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గంగ్యానాయక్, ప్రభావతి అన్నారు. స్పీకర్ పర్యటన నేపథ్యంలో సమగ్రశిక్షా ఉద్యోగులు ఆయనను కలిసి విజ్ఞప్తి చేసే క్రమంలో పోలీసులు మానవత్వం మరిచి ప్రవర్తించారన్నారు. మహిళలనీ చూడకుండా ఇష్టం వచ్చినట్లు నెట్టడంతో పాటు మహిళా ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించారని అన్నారు. వెంటనే పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సప్తవర్ణాల హరివిల్లు


ముగ్గులను పరిశీలిస్తున్న ఆంధ్రజ్యోతి విలేకర్ల బృందం

(5వ పేజీ తరువాయి)

తూంకుంట మున్సిపల్ వైస్ చైర్మన్ వాణీ వీరారెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగజ్యోతి, ఎస్ఐ హారిక, కో-ఆప్షన్ సభ్యుడు నర్సింహులు హాజరయ్యారు. న్యాయనిర్ణేతలుగా శామీర్‌పేట జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయురాలులు రాధిక, ధనలక్ష్మి, గురుకుల మహిళా డిగ్రీ కళాశాల లెక్చరర్లు రాజ్యలక్ష్మి, అనిత, అనుపమ, భాగ్యలక్ష్మి వ్యవహరించగా ప్రోగ్రామ్ స్పాన్సర్‌గా మూడుచింతలపల్లి మాజీ సర్పంచ్ జాంరవి, తూంకుంట మున్సిపల్ వైస్ చైర్మన్ వాణీ వీరారెడ్డి వ్యవహరించారు.

మొదటి బహుమతి గెలుచుకున్న లావణ్య

ముగ్గుల పోటీల్లో కీసరకు చెందిన బి.లావణ్య మొదటి స్థానం, శామీర్‌పేట గురుకుల మహిళా కళాశాలకు చెందిన ప్రత్యూష రెండో స్థానం, ఉపాధ్యాయురాలు మాధవి మూడో స్థానంలో నిలిచారు. విజేతలకు తహసీల్దార్లు యాదగిరిరెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, జాం రవిల చేతులమీదుగా నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతి రూ.6వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు చొప్పున అందజేశారు. పోటీల్లో పాల్గొన్న వారందరికీ తూంకుంట మున్సిపల్ వైస్ చైర్మన్ వాణీవీరారెడ్డి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.


రెండో బహుమతి విజేత ప్రత్యూషకురూ.4వేలు, మూడో బహుమతి విజేత మాధవికి రూ.3వేలు నగదు బహుమతి అందజేస్తున్న మూడుచింతలపల్లి తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ జాము రవి, తదితరులు


ముగ్గులను పరిశీలిస్తున్న జడ్జీలు, అతిథులు, విలేకరులు

ప్రతిభను చాటుకోవడానికి అవకాశం

మహిళల్లో ఉన్న ప్రతిభను గుర్తించడానికి ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహించినందుకు వారికి కృతజ్ఞతలు. ఈ పోటీల్లో పాల్గొనడం ద్వారా మా ప్రతిభను చాటుకోవడానికి మంచి అవకాశం లభించింది.

- ప్రత్యూష, ద్వితీయ బహుమతి విజేత

బహుమతి రావడం ఆనందంగా ఉంది

ముగ్గుల పోటీలో పాల్గొని బహుమతి గెలుచుకోవడం ఆనందంగా ఉంది. మహిళలను ప్రోత్సహించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలి. ఆంధ్రజ్యోతి దమ్మున్న వార్తలు అందించడంతో పాటు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం హర్షణీయం.

- మాధవి, తృతీయ బహుమతి విజేత

పదిరోజుల ముందే సంక్రాంతి



రోజు రోజుకు అంతరించిపోతున్న సంప్రదాయాలను ఏబీఎన్-ఆంధ్రజ్యోతి వా రు వెలికితీయడం అభినందనీయం. తెలంగాణ సాంప్రదాయాలు ఉట్టిపడే విధం గా మహిళలు ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గులు, పతంగులు గుర్తుకు వస్తాయి. పది రోజుల ముందే ఆంధ్రజ్యోతి వారు సంక్రాంతి పండుగను తీసుకొచ్చారు. మహిళల్లో దాగివున్న సృజనాత్మకత కూడా ముగ్గుల ద్వారా వెలుగులోకి వస్తుంది. శామీర్‌పేటలో నిర్వహించడం ఆనందంగా ఉంది. కార్యక్రమాలను రానున్న భవిష్యత్ తరాలకు గుర్తించే విధంగా కొనసాగించాలి.

- యాదగిరిరెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్

ముగ్గులు వేయడం చాలా ఇష్టం



నేటి మహిళలు ఏ రంగంలోనూ తీసిపోరు. ముగ్గులు వేయడం ఆషామాషీ కాదు. నేను సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను అయినప్పటికీ ముగ్గులు వేయడం చాలా ఇష్టం. సంక్రాంతి పండుగ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక. కొత్త సంవత్సరం రాగానే మొదట వచ్చే పండుగ సంక్రాంతి. ఇంటి ముందు ముగ్గులు వేయడం ఒక కళ. ఉదయం లేవగానే పరిసరాలు పరిశుభ్రం చేయడంతో పాటు ముగ్గులు వేయడం ద్వారా మెదడు చురుకుగా పనిచేయడంతో పాటు సరికొత్త ఆలోచనలు వస్తాయి. రంగురంగుల ముగ్గులతో ఒక కళ వస్తుంది. ఇలాంటి ముగ్గుల పోటీల కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం.

- హారిక, సబ్‌ఇన్‌స్పెక్టర్

ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు

ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయం. ఇలాంటి కార్యక్రమాలు ఇంకా పెద్ద ఎత్తున నిర్వహించాలి. ప్రపంచంలోనే తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు పెద్ద పీట ఉంది. కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

- వెంకటనర్సింహారెడ్డి, మూడచింతలపల్లి తహసీల్దార్


ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొన్న దివ్యజ్యోతి స్కూల్ విద్యార్థినులు

క్రైం కార్నర్

వృద్ధురాలి ఆచూకీ లభ్యం


కుటుంబ సభ్యులతో నీలమ్మ

తాండూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుకు వెళ్లి తప్పిపోయిన వృద్ధురాలి ఆచూకీ లభ్యమైంది. అంతారం గ్రామానికి చెందిన కేసీ నీలమ్మ అనే వృద్ధురాలు కొడుకు మల్లేశంతో కలిసి శుక్రవారం తాండూరులోని ఎస్‌బీఐ(ఏడీబీ) బ్యాంకులో డబ్బులు డ్రా చేసుకునేందుకు వెళ్లి తప్పిపోయిన విషయం విదితమే. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీకెమెరాల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. సాయిపూర్ నలంద పాఠశాల సమీపంలో నీలమ్మ కనిపించగా అంతారం గ్రామానికి చెందిన ఎల్లప్ప గమనించి గ్రామస్తులకు సమాచారం అందించాడు. కుటుంబసభ్యులు వెంటనే పట్టణానికి చేరుకుని నీలమ్మను ఇంటికి తీసుకెళ్లారు.

విద్యార్థి అదృశ్యం

మూడుచింతలపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థి అదృశ్యమైన ఘటన శామీర్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జగ్గంగూడలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మైనార్టీ పాఠశాల (మేడ్చల్)లో ఇంటర్ చదువుతున్న బాబు(18) శుక్రవారం రాత్రి నుంచి కనిపించకపోవడంతో అధ్యాపకులు కళాశాల పరిసరాల్లో వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రమించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డైరీ ఆవిష్కరణ

మేడ్చల్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎక్స్‌పర్ట్ గార్డింగ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రూపొందించిన డైరీని శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆయన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ ప్రదీప్‌సింగ్ ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌యాదవ్, జగన్‌రెడ్డి, దయానంద్‌యాదవ్, శంకర్‌యాదవ్, ధర్మారెడ్డి పాల్గొన్నారు.

మేడ్చల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

మేడ్చల్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలో డిగ్రీకళాశాల ఏర్పాటు చేయాలని కోరుతూ మేడ్చల్ కాంగ్రెస్ నాయకులు శనివారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఎన్నికల ముందు మేడ్చల్ పట్టణ విద్యార్థులు చదువు కోవటానికి డిగ్రీ కళాశాల ఏర్పాటు చేసి ఇస్తామని హామీ ఇచ్చిన విషయం గుర్తు చేశారు. దీనికి తోడు పట్టణంలో అసంపూర్తిగా నిలిచి పోయిన రైల్వే అండర్ పాస్ పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు.

ఎన్కెపల్లిని మోమిన్‌పేట్‌లో విలీనం చేయొద్దు

మోమిన్‌పేట్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ మున్సిపాలిటీలో ఎన్కెపల్లి గ్రామాన్ని విలీనం చేయొద్దని ఎన్కెపల్లి గ్రామస్థులు శనివారం పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో విలీనం చేస్తే గ్రామానికి మంజూరయ్యే నిధులు రావని ఆరోపించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి


బీటీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సుల్తాన్‌పూర్ నుంచి తండా వరకు, దోమ రోడ్డు నుంచి రాంరెడ్డిపల్లి వరకు బీటీరోడ్ల నిర్మాణాలకు శనివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తారురోడ్డు లేని ఏ గ్రామానికైనా కొత్త రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. రోడ్డు వసతితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బి.పరశురాంరెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎం.లాల్‌కృష్ణప్రసాద్, కార్యదర్శి కె.హన్మంత్‌ముదిరాజ్, నాయకులు తావుర్యానాయక్, వెంకట్‌రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి


రోడ్డుపై గుంతలను పరిశీలిస్తున్న కొండల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): గుంతలు పడిన రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డికి సూచించారు. చైర్మన్, మున్సిపల్ సిబ్బందితో కలిసి శనివారం ఉదయం ప్రతాప్‌సింగారంలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మహిపాల్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణి, పోచారం మాజీ ఉపసర్పంచ్ అకిటి బాల్‌రెడ్డి, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న అనురాగ్ డాక్టర్ అర్చన

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ డాక్టర్ అర్చన తెలిపారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శనివారం జరిగిన కమ్యూనికేషన్ మరథాన్ ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. నలుగురితో మాట్లాడే సమయంలో జంకు, బిడియం, ఎవరు ఏం అనుకుంటున్నారో అనే భయం లేకుండా మాట్లాడే ప్రయత్నం చేయాలన్నారు. కమ్యూనికేషన్ మారథాన్‌లో ప్రిపేర్ స్పీచ్, సెంట్ అండ్ వీక్నెస్ టాపిక్ లాంటి సెషన్లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ డీన్లు బాలాజీ ఉట్ల, విష్ణు వందన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ వ్యక్తి కాదు శక్తి

శామీర్‌పేట 4 (ఆంధ్రజ్యోతి): లూయిస్ బ్రెయిలీ వ్యక్తి కాదు ఒక శక్తి అని దివ్యాంగుల శాఖ జిల్లా అధికారి స్వర్ణలత అన్నారు. శామీర్‌పేట్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం దివ్యాంగులశాఖ ఆధ్వర్యంలో డా. లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వసంత కుమారి, ఎస్ఐ పరశురామ్‌నాయక్, లూయిస్ బ్రెయిలీ కమిటీ అధ్యక్షుడు నర్సింగ్‌నాయక్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి మురళి, ట్రజరర్ మహేష్ పాల్గొన్నారు.

కార్మికులను పర్మినెంట్ చేసే వరకూ పోరాటం

తాండూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేసే వరకు పోరాటం చేస్తామని మున్సిపల్ సంఘం యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షురాలు విజయలక్ష్మీపండిత్ చెప్పారు. తాండూరు పట్టణం సమద్‌ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన వికారాబాద్ జిల్లా మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ 6వ మహాసభలకు హాజరై ప్రసంగించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.గోపాల్ పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దేముల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోట్లపల్లి గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 6వ తేదీ నుంచి 28లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 3 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

న్యూస్ బాక్స్

ఎమ్మెల్యేను కలిసిన డీపీవో


ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న డీపీవో జయసుధ

తాండూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని వికారాబాద్ డీపీవో జయసుధ మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్ నగరంలోని ఆయన నివాసంలో శనివారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పంచాయతీల పనితీరుపై డీపీవోను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. పంచాయతీల్లో పాలనను మెరుగుపర్చాలని చెప్పారు.

సహకార సంఘాల ఏర్పాటుకు ప్రతిపాదనలు

తాండూరు: తాండూరు అసెంబ్లీ నియోకవర్గంలో మరో ఐదు కొత్తగా వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. ఆయన శనివారం సహకార సంఘం అధికారులతో సమీక్ష అనంతరం విలేకరులతో మాట్లాడారు. బషీరాబాద్ మండలం నవాంద్గి వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని కాశీంపూర్‌ను, యాలాల వ్యవసాయ సహకార సంఘం నుంచి పగిడ్యాల్, తాండూరు మండలం ఎల్మకన్నె వ్యవసాయ సహకార సంఘం నుంచి కరన్‌కోట్‌ను, పెద్దేముల్ రైతు సహకార సంఘం నుంచి మంబాపూర్‌ను కోట్‌పల్లి మండల వ్యవసాయ సహకార సంఘం నుంచి కోట్‌పల్లిని ప్రత్యేక సహకార సంఘంగా ఏర్పాటు చేయాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

ఆర్టీఏ జిల్లా మెంబర్‌గా ఎర్రవల్లి జాఫర్



వికారాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ ఆర్టీఏ జిల్లా మెంబర్‌గా వికారాబాద్ మండల కాంగ్రెస్ నాయకుడు, మాజీ మండల కోఆప్షన్ సభ్యుడు ఎర్రవల్లి జాఫర్‌ను నియమితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కార్యాలయం నుంచి ఎర్రవల్లి జాఫర్‌ను ఆర్టీఏ మెంబర్‌గా నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024లో ఎన్నికల్లో మైనార్టీలను ఏకంగా చేయడంలో ఎర్రవల్లిజాఫర్ కీలక వ్యవహరించి ప్రస్తుత స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గెలుపులో కీలక పాత్ర పోషించారు.

ఎలక్ట్రికల్ వాహనాల షోరూం సందర్శన


ఎలక్ట్రిక్ వాహనాలను పరిశీలిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తాండూరు మండల మాజీ అధ్యక్షుడు షేకాపురం ఆంజనేయులు నూతనంగా ప్రారంభించిన ఎలక్ట్రికల్ వాహనాల షోరూంను శనివారం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సందర్శించారు. రాబోయే తరాల్లో ఎలక్ట్రికల్ వాహనాలను వినియోగించి మన దేశంలో వాయు కాలుష్యాన్ని నియంత్రించే లక్ష్యంలో ప్రధాని మోదీ దిశా నిర్దేశం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యు.రమేష్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు మల్లేశం, బీఎస్ఎన్ఎల్ కమిటీ సభ్యులు గాజుల శాంతికుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన రేణుకా ఎల్లమ్మ బోనాలు

తాండూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రెండు రోజుల పాటు కొనసాగిన తాండూరు పట్టణం వాల్మీకినగర్‌లోని రేణుకా ఎల్లమ్మ బోనాల పండుగ శనివారం ముగిసింది. దేవస్థాన కమిటీ, మహిళ మండలి ఆధ్వర్యంలో రెండురోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. భక్తులు హాజరై నైవేద్యాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సంక్షిప్తంగా..

ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ఘట్‌కేసర్: ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ మాధవరెడ్డి రైల్వేవంతెన సమీపంలో ఏర్పాటు చేసిన ఆగస్త్య ట్రెడిషనల్ క్యూర్ కేంద్రంలో శనివారం దశామృత నిర్గుండి కషాయం ఉచితంగా పంపిణీ చేశారు.

ఎంఈవోకు ఘన వీడ్కోలు

పూడూరు: పూడూరు ఎంఈవో హరిశ్చందర్‌కు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఘనంగా వీడ్కోలు పలికారు. హరిశ్చందర్ కొంతకాలంగా ఎంఈవోగా విధులు నిర్వహించారు. ఆయన బదిలీపై వెళుతుండటంతో శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించి వీడ్కోలు పలికారు.

విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ

పరిగి: సాలిప్పలిబాటతండా పాఠశాలలోని 48మంది విద్యార్థులకు పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల 1996-98 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో వాటర్‌బాటిల్స్ పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు.

పాఠశాలకు సౌండ్ బాక్సు విరాళం

ధారూరు: మోమిన్‌కుర్దు పాఠశాలకు గ్రామానికి చెందిన మల్లికార్జున్‌రెడ్డి శనివారం రూ.12వేలు విలువ గల సౌండ్ బాక్సును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నర్సింహులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో ధాన్యం, కందుల బీట్లు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం ధాన్యం, కందుల బీట్లు నిర్వహించారు. ధాన్యం 1010రకం క్వింటాలుకు రూ.2,000ల నుంచి రూ.2,200ల వరకు సోనా రకం క్వింటాలుకు రూ.2,310 నుంచి రూ.2,670ల వరకు, కందులు క్వింటాలుకు రూ.7,650ల నుంచి రూ.8,040 వరకు ధరలు పలికాయి. ధాన్యం 371.2క్వింటాళ్లు, కందులు 375క్వింటాళ్లు క్రయవిక్రయాలు జరిగాయని మార్కెట్ అధికారి సిద్దమ్మ తెలిపారు.

బీసీ సంఘం ఆధ్వర్యంలో సన్మానం

తాండూరు: విద్యావేత్త పర్యాద రామకృష్ణకు తెలంగాణ పుడమి సాహితీవేదిక విశిష్ట పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా తాండూరు నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. అదేవిధంగా 30 ఏళ్లుగా బీసీల హక్కుల కోసం పోరాడుతున్న బీసీ రాష్ట్ర నాయకులు సయ్యద్ షుకుర్‌ను సన్మానించారు.

మహిళ మృతికి కారణమైన ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలి

పరిగి: మహిళా మృతికి కారణమైన పరిగిలోని సాధన మల్టీస్పెషాలిటి ఆస్పత్రిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఐపీకేఎంఎస్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మహేందర్, మల్లేశ్ శనివారం జిల్లా వైద్యాధికారి వెంకటరమణకు విన్నవించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ఘట్‌కేసర్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఘట్‌కేసర్ ట్రాఫిక్ సీఐ రవీందర్ తెలిపారు. యంనంపేట్ చౌరస్తాలో శనివారం సాయంత్రం క్యాబ్‌డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. కార్ల డ్రైవర్లు తప్పనిసరిగా సీటు బెల్ట్ పెట్టుకుని సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు.

'భగీరథ' పైపులైన్ పనులకు సర్వే

దుద్యాల: దుద్యాల మండలంలోని సంద్రకుంట, నాన్యనాయక్ తండాల్లో శనివారం మిషన్ భగీరథ ఏఈ సాయినాథ్‌రెడ్డి పర్యటించారు. నాన్యనాయక్ తండాలో కొత్తగా నిర్మించిన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకుకు ప్రధాన పైపులైన్ నుంచి ఏర్పాటు చేయాల్సిన పైపులైన్ పనులకు సంబంధించి సర్వే చేశారు.

వీవీహెచ్ఎస్ స్కూల్ ఆస్తి మార్పిడిని రద్దు చేయండి

తాండూరు: నిబంధనలకు విరుద్ధంగా చేసిన విజయవిద్యాలయ హైస్కూల్ ఆస్తి మార్పిడిని రద్దుచేయాలని వీవీహెచ్ఎస్ పూర్వవిద్యార్థుల అసోసియేషన్ ప్రతినిధులు శనివారం మున్సిపల్ అధికారులను కోరారు.

కేజీబీవీ పాఠశాల సందర్శన

కులకచర్ల: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను శనివారం బీజేపీ నాయకులు సందర్శించారు. పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. వారి సమస్యలు, బోధన, భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జానకిరామ్, సౌమ్య వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.